క్లుప్తంగా

సీఐ, ఎస్సైలకు సన్మానం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లను మంగళవారం తెలంగాణ మాల మహానాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివకుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి వేల్పుల సమ్మక్క, జిల్లా యూత్ అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మాదరి నరసింహారావు, ఉపాధ్యక్షుడు మాదరి రాంబాబు, నాయకులు బోడ సారయ్య, మాధురి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రెన్యువల్ చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: జర్నలిస్టుల అక్రిడిటేషన్ నేడు(బుధవారం)నుంచి రెన్యువల్ చేసుకోవాలని డీపీఆర్‌ఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కాల పరిమితి మూడు నెలలు పొడగించడం జరిగిందని రెన్యువల్ స్లిప్‌లు డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు రెన్యువల్ కోరకు అక్రిడిటేషన్ ఒరిజినల్‌తో పాటు ఒక కాపీ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తరువాతే బస్సు పాస్ రెన్యువల్ చేసుకుని అవకాశం ఉంటుందన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ములుగు రూరల్: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండి గఫూర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ములుగు ఏరియా ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధి మామిడిరేవుపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ బాలరాజ్ (35) మృతి చెందాడని అన్నారు. గిరిజన మారుమూల గ్రామాల్లో విద్యుత్ లైన్‌లపై నుంచి 11 కేవీ లైన్ ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో ట్రాన్స్ ఫార్మర్‌లకు ఆన్ ఆఫ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర రాజు, మాజీ సర్పంచ్ గుగులోత్ తిరుపతి, రత్నం ప్రవీన్, రమేష్, దేవేందర్ ఉన్నారు.

పరామర్శ



కన్నాయిగూడెం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాసం పెల్లి రాంబాబు తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్ పాషా మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బు రమేష్, మండల అధ్యక్షుడు తాటి రాజబాబు, మండల ఉపాధ్యక్షుడు మంగలారపు సత్యం, కటకం మల్లయ్య, మాదాస్ రాజేందర్, దాసరి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు కంకణాల నర్సయ్య తండ్రి పోషాలు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీలు గుండబోయిన నాగలక్ష్మీ అనిల్, చాప ఉమాదేవినరేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు పోషాలు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

అటవీ అధికారులు బాధ్యత వహించాలి



కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామ పంచాయతీకి చెందిన మలకపల్లి గ్రామానికి చెందిన పెద్దం లక్ష్మయ్య మృతికి అటవీ శాఖ అధికారులే బాధ్యత వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పరామర్శించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. మండలంలోని గిరిజనేతరుడి భూమి చదును చేయడానికి కూలికి వెళ్లిన పెద్దం లక్ష్మయ్యపై అటవీ అధికారులు అతి ఉత్సాహం ప్రదర్శించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పోలీసులు మందలించడంతో భయంతోనే అతను ఆత్మహత్య చేసుకోని మృతి చెందినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు అవగాహన లోపంతో చేశారని వెంటనే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతని చావుకు మరో కారణమైన పోడు రైతును కూడా శిక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరం చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పాఠశాలల్లో అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని అధికారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి రాంకుమార్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిని శైలజ, జిల్లాలోని అన్ని ఎంజేపీ, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మైనారిటీ, యూఆర్ఎస్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, స్పెషల్ ఆఫీసర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో పలు అంశాలపై సుదీర్ఘంగా ఎమ్మెల్యే చర్చించారు. పలు స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు ఆయా స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు వెంటనే పూర్తిచేయాలని, స్కూళ్లల్లోఉన్న టీచర్ పోస్టులఖాళీలను తదితర సమస్యలుంటే నివేదిక ద్వారా తెలియజేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పాఠశాలల అదనపు తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కొన్ని పాఠశాలల్లో తాగు నీరు, డ్రెయినేజీ, కాంపౌండ్ వాల్, విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రతిపాదనలు తయారు చేసి తీసుకుస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీఓ వసుమతి

కాటారం: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల కేంద్రానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో, నస్తూర్‌పల్లిలో నిర్వహించిన పనులను మంగళవారం అదనపు డీఆర్‌డీఓ వసుమతి పరిశీలించారు. పనులు కొనసాగిన తీరు, వర్షపు నీరు నిల్వ అవుతుందా లేదా అని ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా ఉపాధిహామీ పనులు చేయించాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న ప్రతి పనిలో పారదర్శకత ఉండాలని ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు ఉండాలని ఆదేశించారు. అనంతరం నస్తూర్‌పల్లి నుంచి కాటారం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. మొక్కల చుట్టు నీరు నిలిచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అడిషనల్ డీఆర్‌డీఓ వెంట ఏపీఓ వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్‌లు మనోజ్, రమేష్ ఉన్నారు.

‘నకిలీ హక్కుపత్రాలతో రైతుబంధు’

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి పరిధిలోని దొడ్ల-కొత్తూరు గ్రామానికి చెందిన దళితుల పోడు వ్యవసాయ భూములపై కొంతమంది గ్రామానికి చెందిన ఆదివాసీలు నకిలీ హక్కుపత్రాలతో రైతు బంధు పొందుతున్నారని ఏజెన్సీ దళిత సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పరికి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొండాయి గ్రామానికి చెందిన దళితుల భూములను అక్రమంగా ఆక్రమించుకునే ప్రయత్నంలో భాగంగా నకిలీ హక్కుపత్రాలు సృష్టించి అధికారులను ప్రభుత్వాన్ని మోసం చేస్తూ రైతు బంధు పొందుతున్నారన్నారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కలెక్టర్ దివాకరకు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. 1949 పూర్వం నుంచి దళిత కుటుంబాలు అటవీ గ్రామాలలో గిరి జనులతో మమేకమవుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. 1986లో గోదావరి వరదలు వచ్చి కొండాయి జంపన్న వాగు పొంగి గ్రామంలోనీ తమ దళితుల వ్యవసాయ భూముల్లో పూర్తిగా ఇసుకమెట్టలు వేసి జంపన్న వాగులో కలిసిపోవడం జరిగిందన్నారు. 1996 సంవత్సరంలో దొడ్ల కొత్తూరు గ్రా మానికి కట్టు బట్టలతో వచ్చి పోడు చేసుకుని సాగు చేసుకొని జీవనం గడుపుతున్నామన్నారు. ప్రస్తుతం దళితులు సాగు చేస్తున్న భూములపై అధికారులు సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్‌గా ఇప్ప మొండి



చైర్మన్ మొండిని అభినందిస్తున్న డైరెక్టర్లు

మల్హర్: మండలంలోని తాడిచర్ల సహకార(పీఏసీఎస్) సంఘం తాత్కాలిక చైర్మన్‌గా ఇప్ప మొండి ఎన్నికయ్యారు. తాత్కాలిక చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయంలో డీసీఓ శైలజ ఆధ్వర్యంలో మంగళవారం ఎంసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 9మంది డైరెక్టర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు డైరెక్టర్లు పాల్గొన్నారు. దీంతో వారి మెజారిటీతో ఇప్ప మొండిని తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు డీసీఓ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగిన రామారావు డిఫాల్ట్‌గా మిగిలి పోవడంతో అనర్హత వేటు పడిందన్నారు. అలాగే వైస్ చైర్మన్ ప్రకాశ్‌రావు సైతం తన పదవీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. దీంతో ఎంసీ మీటింగ్ నిర్వహించి మోజారిటీ సభ్యులతో తాత్కాలిక చైర్మన్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. 13 మంది డైరెక్టర్లకు గాను ఇప్పటికే ముగ్గురు డెరెక్టర్లపై వేటు పడిందన్నారు. ఖాళీ స్థానాలకు నామినేట్ చేసుకోని ఎలక్షన్ అథారిటీకి పంపించనున్నట్లు పేర్కొన్నారు. వారి సూచనల మేరకు ఎన్నిక నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

ఎంసీ మీటింగ్ బహిష్కరణ

తాడిచర్ల పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఎంసీ మీటింగ్‌ను బహిష్కరించినట్లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు సుంకు రాము, మాచెర్ల సురేష్, రాజమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంగళవారం ఎంసీ సమావేశం నిర్వహిస్తామని నోటీసులు ఇచ్చారన్నారు. మీటింగ్ అని చెప్పి వెళ్తే తాత్కాలిక చైర్మన్ ఎన్నుకోనున్నట్లు తెలపడంతో సమావేశం నుంచి బయటకు వచ్చి బహిష్కరించినట్లు తెలియజేశారు. డీసీఓ ఇష్టానుసారంగా వ్యవహరించి ఐదుగురు డైరెక్టర్లతో తాత్కాలిక చెర్మన్‌ను ఎన్నుకున్నారని ఆరోపించారు.

ప్రైవేట్ ఆస్పత్రి భవనం సీల్ తొలగింపు



భవనం సీల్ తొలగిస్తున్న అధికారులు

కాటారం: మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ సమీపంలోని న్యూ లైఫ్‌లైన్ ప్రైవేట్ ఆస్పత్రి భవనానికి సంబంధించిన సీల్‌ను మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తుండటంతో 23 డిసెంబర్ 2022లో అప్పటి వైద్యాధికారి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రి భవనం యజమాని ఆస్పత్రి నిర్వాహకులపై ఒత్తిడి తేవడంతో భవనం తెరవడం కోసం సదరు యజమానులు జిల్లా వైద్యశాఖకు రూ.10వేలు జరిమానా చెల్లించారు. దీంతో నిబంధనల మేరకు జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది పర్యావేక్షణలో భవనం సీల్ తొలిగించారు. కేవలం భవనం సీల్ మాత్రమే తొలగించడం జరిగిందని అనుమతులు పొందిన తర్వాతే ఆస్పత్రి నిర్వహణ చేపట్టుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య, మండల వైద్యాధికారిని మౌనిక, కానిస్టేబుల్ రఘు, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సతీశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను కళాశాల అధ్యాపకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో సాధించాలని కోరారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం జరగుతుందన్నారు. కళాశాలలో ల్యాబ్ సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నట్లు పేర్కొన్నారు, ఇటీవల పదవ తరగతి పాసైన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉన్న తాడిచర్ల జూనియర్ కాలేజీలో ప్రవేశాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ రవీందర్, అధ్యాపకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, స్వరూప రాణి, నరేష్, రమేశ్, భరత్‌రెడ్డి, జైపాల్, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రేగొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలచే వానాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతు భరోసా ఎక్కువ మంది రైతులకు లబ్ధిచేకూరలంటే ఏ ప్రామాణికంగా తీసుకోవాలో క్షేత్ర స్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్నారు. అదే విధంగా ఈ సమావేశానికి హాజరైన రైతుల అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని జిల్లా, మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంజీవరావు, మండల వ్యవసాయ అధికారులు వాసుదేవరెడ్డి, సతీష్, ఐలయ్య, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భూపాలపల్లి డివిజన్ ఉద్యానశాఖ అధికారి సునీల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలుబాక (జెడ్) గల ప్రభుత్వ భూమిని గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా వలస గిరిజనేతరులకు పట్టాలు ఎలా చేస్తారని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి రెవెన్యూ ఉద్యోగుల సహకారంలో రికార్డులను తారుమారు చేస్తున్నారని అక్రమ పట్టాలను ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ఆలుబాకలో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేత్రానంద కుమార్, తాటి రాంబాబు, చంటి, సాంబశివరావు, లక్ష్మణ్, రాజు, సమ్మయ్య, గోవింద్ తదితరులు ఉన్నారు.

పారిపోయిన యువకుడి గుర్తింపు

● కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



యువకుడిని బంధువులకు అప్పగిస్తున్న ఎస్సై చక్రపాణి, తదితరులు

కాళేశ్వరం: ఫీజులో కొంత డబ్బు వాడుకున్నాడని తండ్రి మందలించడంతో ఈనెల 20న పారిపోయి కాళేశ్వరం చేరుకున్న యువకున్ని పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గణపురం మండలం చెల్పూర్‌కు చెందిన డ్రైవర్ రవీందర్ చిన్న కుమారుడు అక్షయ్ నర్సంపేటలో బీటెక్ మొదటి సంవత్సరం వరంగల్‌లోని మేనత్త ఇంట్లో ఉంటూ చదువుతున్నాడు. ఫీజులో కొంత డబ్బు వాడుకున్నాడని తండ్రి మందలించడంతో తల్లిదండ్రులపై కోపంతో ఈనెల 20న వరంగల్ ములుగు రోడ్డుసమీపంలో కాలేజీ బస్సు దిగి అలిగి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కాళేశ్వరం చేరుకున్నాడు. ఐదు రోజులుగా ఇంట్లో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసిన ఆచూకీ తెలియలేదు. దీంతో మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అక్కడి పోలీసులు సెల్‌ఫోన్ ట్రేసింగ్ చేయడంతో కాళేశ్వరంలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో కాళేశ్వరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్ కనుకయ్య ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరిగి అడవిలో చెట్ల పొదల్లో ఉన్న అక్షయ్‌ని పట్టుకున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు ఆ యువకుడిని ఎస్సై చక్రపాణి, పోలీసులు అప్పగించారు. ఆయన వెంట లీగల్ అడ్వైజర్ సందీప్ తదితరులు ఉన్నారు.

‘డబుల్’ ఇళ్లను పేదలకు కేటాయించాలి



మాట్లాడుతున్న సేనాపతి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను కాసీంపల్లి గ్రామానికి చెందిన అర్హులైన పేదలకు అందించాలని బీజేపీ కాసీంపల్లి 12, 13 వార్డు కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకుడు మార్నేళ్ల సేనాపతి మాట్లాడారు. కాసీంపల్లి గ్రామానికి చెందిన వారికి గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారని, అధికారులు ఇప్పుడు అందులో కొందరిని అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. ఆ అనర్హుల స్థానంలో అర్హులైనటువంటి కాసీంపల్లి గ్రామానికి చెందిన 12, 13 వార్డు నిరుపేదలకు మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు శంకర్, రాజు, జోరు కృష్ణకాంత్, తూటి రాజు, అనిల్, మౌనాకర్, రాజేందర్, సంతోష్, కౌషిక్, అజయ్, అఖిల్, విజయ్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మంగపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాజేడు: ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మంగపేట: బడీడు పిల్లలందరిని వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బానోతు బాలజీ కోరారు. బాల రక్ష భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ సమన్వయంతో రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేఫ్ బ్యాక్ టు స్కూల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో గ్రామంలో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బానోతు బాలాజీ మాట్లాడుతూ.. అందరూ చదవాలి అందరూ ఎదగాలని బాల బాలికలు అనే వ్యత్యాసం చూపకుండా అందరిని పాఠశాలకు పంపించాలన్నారు. చదువు బాలబాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందన్నారు. పాఠశాల అనేది పిల్లలకు సురక్షితమైన ప్రదేశమన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రమేష్, ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, పాయం వీరనారాయణ, జమున, రాజ్యలక్ష్మి, పావని, పద్మ, సుజాత, మహాదేవి, రామారావు, నాగేంద్ర, ప్రసాద్, నాగమణి, గణేష్, శ్రీనివాస్, పోషన్న, ప్రమీల, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: ఆడపిల్లలను చదివిద్దాం, ఆడ పిల్లను ఎదుగనిద్దామని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సేఫ్ బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలందరు బడిలో ఉండాలని నినాదాలను చేశారు. అనంతరం మండల కేంద్రంలో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అందరు చదువు కోవాలని, ప్రతి ఒక్కరూ ఎదగాలని, బాల బాలికల మధ్య వ్యత్యాసం చూపకుండా పిల్లలందరిని పాఠశాలకు పంపించాలని, అది భవిష్యత్‌కు బగారుబాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలరక్ష భారత్ ప్రతినిధి శ్రీకాంత్, ఆనందరావు, స్వరూప్ సింగ్, మల్లయ్య, ఆనంద్, రవికుమార్, శ్రీకాంత్, రాజ్యలక్ష్మి, ప్రభాకర్, రాజేష్ కుమార్ ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

● భర్త హత్య చేశాడని మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ



సమత (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆకుదారివాడలో మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్ ముడలం ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు సమ్మక్కల కుమార్తె సమత (28)ని ఆకుదారివాడకు చెందిన విస్లావత్ హతిరాంకు ఇచ్చి 2016లో వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు సామిత్, కుమార్తె తేజల్ ఉన్నారు. అయితే గత ఏడాది క్రితం నుంచి ఇరువురు భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయని, హతిరాం వేరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలోనే హతిరామే భార్యను హత్య చేసి ఉంటాడని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, సమత ఉదయం ఇంట్లో నుంచి ఇంటి పరిసర ప్రాంతంలోని ఓసీ సమీపంలో గొర్రెపిల్లను తీసుకొని మేతకు వెళ్లిందన్నారు. ఆ వెంటనే కొద్దిసేపటికి హతిరాం కూడా వెళ్లి గొడవపడ్డాడని, ఆ తదుపరి మెడ చుట్టూ చున్నీ చుట్టి హత్య చేశాడని వాపోయారు. గొర్రెపిల్లను కూడా చంపేసి ఆ హత్యను వేరొక వ్యక్తుల మీదకు నేట్టేసేందుకు చిత్రీకరించినట్లు ఆరోపించారు. అయితే సుమత మృతి చెందిన విషయం తెలుసుకున్న సీఐ నరేష్ కుమార్, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. కాగా, హతిరాంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి

గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం చెరువు తూము మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మరమ్మతు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. చెరువు నీళ్లను ఖాళీ చేసి పనులు చేపట్టినప్పటికీ వర్షాకాలం ప్రారంభమైన పనులు పూర్తికాకపోవడంతో రైతులు అసహనానికి గురవుతున్నారని అన్నారు. తూము మరమ్మతు పనుల్లో కొంత మేరకు మాత్రమే పూర్తి అయ్యాయని అన్నారు. వర్షాలు అధికంగా కురిస్తే పనులు నిలిచి పోయే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే 19 ఫీట్ల నీళ్లను వృథాగా కిందకు వదిలారని అన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన దుక్కిటెద్దు

చిట్యాల: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నద్దునూరి రాజ్‌కుమార్‌కు చెందిన దుక్కిటెద్దు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. అక్కడ మేత మేస్తుండగా 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి షాక్ గురై మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకున్నాడు.